## కథ

# ప్రమోషన్ కోసం

**మున్నంగి పద్మలత**

**"అమ్మో! టైమ్ తొమ్మిదయ్యిందా? గడియారంలో ముల్లు కాస్త స్లోగా తిరగచ్చు కదా.. ఆ ప్రకాష్‌గాడు ఏం చేస్తున్నాడో ఏమో" కాలకృత్యాలు కూడా తీర్చుకోకుండా లేస్తూనే వంటింట్లో ఉన్న ప్రకాష్ దగ్గరకి పరుగు తీశాడు శంకరం. చేతిలో వంటల పుస్తకం పట్టుకొని మరుగుతున్న పులుసులో కారం ఎంత వెయ్యాలో తెలీక ఆలోచిస్తూ కనిపించాడు ప్రకాష్.**

"ఏరా వంట ఎంత వరకూ వచ్చింది?" అడిగాడు శంకరం.

"ఏదో తగలేస్తున్నానుగానీ, ఇందులో కారం ఎంత వెయ్యమంటావ్?"

"తినే పదార్థంలో ఏదైనా ఎంత ఎక్కువ వేస్తే అంత బావుంటుంది" కుకింగ్ ఎక్స్‌పర్ట్‌లా ఉచిత సలహా పారేశాడు శంకరం.

"ఇలాంటి సింపుల్ విషయాలు థియరీలో ఉండవు. ప్రాక్టికల్స్ చేస్తే అన్నీ అవే తెలుస్తాయి" మనసులో ఏవో లెక్కలు కట్టి ప్రకాష్ చేత ఓ ఆరు పెద్ద చెమ్చాల కారం వేయించేశాడు శంకరం. పులుసు బాగా మరిగి కారం నషాలానికి అంటేసరికి వంట బ్రహ్మాండంగా కుదురుతోందని, తమకి ప్రమోషన్ ఖాయమని, ఉక్కిరిబిక్కిరి అయిపోయారు ఇద్దరూ.

శంకరం, ప్రకాష్‌లు మంచి స్నేహితులు. ఇద్దరిదీ ఒకే ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు. ఇద్దరి భావాలు కూడా మేచ్ అవ్వడంతో ఒకే ఇల్లు అద్దెకి తీసుకొని ఉంటున్నారు. ఆఫీసులో పొద్దుట్నుంచి పొద్దుపోయే వరకు గొడ్డుచాకిరీ చేసినా క్లర్క్ పోస్టుకే పరిమితమయ్యారు. ఇంకా పైకి రావాలంటే కొత్తగా వచ్చిన పై ఆఫీసరు సుందరరావుని కాకా పట్టి ప్రమోషన్ కొట్టేయాలని వాళ్ల ఆశ. బాసు భోజనప్రియుడని తెలుసుకొని ఆఫీసులో ఎవరికీ తెలియకుండా రహస్యంగా ఈ ఆదివారం భోజనానికి పిలిస్తే, సకుటుంబంతో వస్తానని మాట ఇచ్చేశాడు సుందరరావు. బజారులో 'గంటలో వంట నేర్చుకోడం ఎలా' అనే పుస్తకాన్ని కొనుక్కొని గిన్నెలు, గిలకలు అద్దెకు తెచ్చుకొని మరీ వంట మీద తమ ప్రతాపం మొదలెట్టారు స్నేహితులిద్దరూ.

★ ★ ★

"ఒరేయ్...శంకరం! కూర ఏం చేద్దాం?"

"వంకాయ కూర" హుషారుగా చెప్పాడు శంకరం. "మన బాస్‌కి వంకాయలంటే తుమ్మెదకి పువ్వులో పుప్పొడంత ఇష్టమట" ఏదో క్రియేటివ్‌గా ఉంటుందని ఉపమానం కుదరకపోయినా నవ్వుతూ చెప్పాడు శంకరం.

"ఈ వంటల పుస్తకంలో వంకాయ కూర పేజీ చిరిగిపోయిందిరా. ఇప్పుడెలా?" అన్నాడు ప్రకాష్ కష్టకాలంలో కరువు వచ్చినట్టు.

"ఏం పర్వాలేదు.. నా బుర్రలో పేజీలు చిరగలేదు. కూర ఎలా చెయ్యాలో నే చెప్తాను" అప్పటికే కూర ఎలా చెయ్యాలో బట్టీపట్టినట్టు ధీమాతో చెప్పాడు శంకరం.

"సరే చెప్పు. ముందు పోపు వెయ్యాలా...నీళ్లు పోయాలా?" అడిగాడు ప్రకాష్ బుర్ర గోక్కుంటూ.

"ముందు పోపేసి ముక్కలేస్తే నీళ్లు తన్నుకుంటూ అవే వస్తాయి" లీనమైపోతూ చెప్పడం మొదలెట్టాడు శంకరం. ఆ మాటలకి వంకాయల వైపు చిత్రంగా చూశాడు ప్రకాష్, ఏదో తెలియని సందేహంతో.

"ముక్కలు కట్ చేసి పోపేస్తే, అందులో రసాయనిక చర్య జరిగి నీళ్లు అవే వస్తాయి" మళ్లీ చెప్పడం ప్రారంభించాడు శంకరం.

"నువ్వు ఎంత సైన్స్ స్టూడెంట్ అయితే మాత్రం రసాయనాలన్నీ వంటల్లో కలిపేస్తావా?" అన్నాడు ప్రకాష్, శంకరాన్ని ఎగాదిగా చూస్తూ.

తన కూర కామెంట్రీకి అడ్డు తగిలాడనే కోపంతో అట్లకాడ తీసుకొని ప్రకాష్ చేతి మీద చురక పెట్టేశాడు శంకరం. చెయ్యి చుర్రుమనేసరికి మారుమాట్లాడకుండా మిత్రుడు చెప్పినట్టే చేశాడు ప్రకాష్. కూర కలుపుతూ మధ్య మధ్యలో నీళ్లు ఎప్పుడొస్తాయా అని మూకుడులో మొహం పెట్టి చూస్తున్నాడు. నీళ్లు ఎప్పటికీ రాకపోయేసరికి కూర తగలడేటట్టుందని, శంకరం చూడకుండా ఓ గ్లాసు నీళ్లు కూరలో పోసి మూత పెట్టేసి స్నానానికి వెళ్లిపోయాడు ప్రకాష్.

★ ★ ★

"ఒరేయ్ ప్రకాష్." మిన్ను విరిగి మీద పడినంత గట్టిగా అరిచాడు శంకరం.

"ఏం ఏమైయ్యింది?" శంకరం వేసిన కేకకి అదిరిపడ్డాడు ప్రకాష్.

"నేను ముందే చెప్పానా.. రసాయనిక చర్య వల్ల నీళ్లు అవే వస్తాయని, ఇప్పుడు చూడు ఎన్ని నీళ్లు వచ్చాయో" ప్రకాష్‌ని బరబరా వంటింట్లోకి లాక్కుపోయాడు శంకరం.

"ఏడిశావ్! రసాయనక చర్యా నీ బొందా! నువ్వు చూడకుండా కూరలో నీళ్లు నేనే పోశాను. హి...హి...హి..." పళ్లు ఇకిలిస్తూ చెప్పాడు ప్రకాష్.

"వెటకారం చాలు గాని బాస్ వచ్చే టైమ్ అయ్యింది త్వరగా రెడీ అవ్వు" అన్నాడు శంకరం వాచీ చూపిస్తూ.

"అవుతానురా..నేను రెడీ అయ్యేది బాస్ కోసం కాదు, ఆయన కూతురు కోసం. ఆ అమ్మాయిని చూడాలంటే రెండు కళ్లూ చాలవట. మన ఆఫీసు ప్యూన్ పొరపాటున చూశాడట. చెప్పాడు" తన్మయత్వంతో జుట్టుని అనవసరంగా రింగులు తిప్పుకుంటూ ప్యూన్ చెప్పిన వైనాన్ని ఆడియో, వీడియో మిక్స్ చేస్తూ చెపుతున్నాడు ప్రకాష్. అంతే తన్మయంతో వింటూ బాస్ కూతుర్ని ఊహించుకుంటూ రంగుల కల కనేస్తున్నాడు శంకరం, ఓ పనైపోతుందని.

★ ★ ★

'టింగ్...టాంగ్..' కాలింగ్ బెల్ మోగడంతో కలలో ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చి తలుపు తీశాడు శంకరం. ఎదురుగా బాస్ సుందరరావు ఆయన సపరివారం కనిపించారు. అందరినీ సాదరంగా లోపలకి ఆహ్వానించారు ఇద్దరూ.

"ఈవిడ మా ఆవిడ" సినిమా టైటిల్స్‌లా పరిచయాలు మొదలుపెట్టాడు సుందరరావు. "ఈ అమ్మాయి మా పెద్దమ్మాయి".

ఇద్దరూ ఆ అమ్మాయిని చూసి అలా ఉండిపోయారు. ప్యూన్ రెండు కళ్లు చాలవని ఎందుకన్నాడో అప్పుడు అర్థమయ్యింది. మరో రెండు కళ్లు అప్పు తెచ్చుకుంటే గానీ ఆ విశాలమైన ఆకారాన్ని చూడడం సాధ్యం కాదని అనుకున్నారు.

"ఈ పాప మా చిన్నమ్మాయి" సుందరరావు తన ఎనిమిదేళ్ల పాపని పరిచయం చెయ్యగానే గబగబా వచ్చి ప్రకాష్ చెంప ఛెళ్‌మనిపించింది. అనుకోని ఆ సంఘటనకు బిత్తరపోయాడు ప్రకాష్.

"ఏమనుకోకయ్యా, మా అమ్మాయికి మీసం అంటే కాస్త ఎలర్జీ. ఎవరికైనా మీసం ఉంటే చాలు గూబ మీద ఒక్కటిచ్చుకొంటుంది. దీనికి ఈ అలవాటు మాన్పించలేకపోతున్నాం" అదేదో మామూలు విషయంలా నెమ్మదిగా చెప్పాడు సుందరరావు.

"ఫర్వాలేదులెండి. కొన్ని అలవాట్లు మాన్పించలేం" వంతపాడుతూ అన్నాడు ప్రకాష్.

"నువ్వు ఎంత మంచివాడివి బాబు.. మా పాపని

నువ్వు బాగా అర్థం చేసుకున్నావు. మొన్న మా పిన్నిగారి అమ్మాయి పెళ్లిచూపుల్లో, పెళ్లికొడుకు



తండ్రికి బూరుగు దూదిలా మీసాలు ఉండేసరికి మా పాప చూసి ఆగలేక మీసాన్ని గట్టిగా మెలిపెట్టి తిప్పేసింది. అంతే! పెళ్లివారికి కోపం వచ్చి చటుక్కున లేచి వెళ్లిపోయారు. చిన్నపిల్ల ఏదో అల్లరి చేసిందే అనుకో, దానికి అంత కోపం రావాలా'' పాపని వెనకేసుకొంటూ, జరిగిన విషయం గురించి విపులంగా చెప్పింది సుందరరావు భార్య.

''అబ్బ.. ఆపవే నీ సోది. వీడు మా పెద్దబ్బాయి వంకేష్''

బాస్‌కి వంకాయలంటే మరీ పిల్లలకి పేర్లు తగిలించుకునే అంత ఇష్టమనుకోలేదు శంకరం ప్రకాష్.

''ఈమె మా చెల్లెలు. ఈయన మా బావగారు. వీళ్లిద్దరు వారి సంతానం. మా ఇంటికి వీళ్లు భోజనానికి వస్తే మేము మీ ఇంటికి తీసుకొచ్చాం'' అందర్నీ చూపించి చతికిలబడ్డాడు సుందరరావు. అంతలో 'వా' అని పొలికేక వినిపించి అందరూ అటు చూశారు. సుందరరావు చిన్నకొడుకు, తనని పరిచయం చెయ్యనందుకు పెద్దగా అరుస్తూ గోల చేస్తున్నాడు. ''అన్నట్టు మరిచాను, వీడు మా చంటాడు బ్రింజేష్'' చెప్పాడు సుందరరావు పిల్లాడ్ని ఎత్తుకొంటూ. బాస్ మెప్పుకోసం పిల్లాడి బుగ్గ పట్టుకొని పలకరించాలనుకు

న్నాడు ప్రకాష్. కానీ వీడికెలాంటి దిక్కుమాలిన అలవాట్లు ఉన్నాయో అని ఆ పని విరమించుకున్నాడు ముందు జరిగిన అనుభవం గుర్తొచ్చి.

అందరూ మాటల్లో పడ్డారు. పిల్లలు ఇల్లంతా తిరుగుతూ పైకప్పు పీకి పందిరేస్తున్నారు. మాటల మధ్యలో బాస్ పెద్ద కూతురు శంకరం ప్రకాష్‌ల వైపు మార్చిమార్చి చూస్తూ నవ్వుతోంది. ఆ నవ్వుకి ఇద్దరూ తలో రకంగా మెలికలు తిరిగిపోతున్నారు. కాసేపటికి టీవీ పెట్టమని అడిగింది. శంకరం టీవీ ఆన్ చేసేసరికి ఒక్క ఉదుట్న లేచి నిల్చుంది. ఏం చేస్తుందో ఏమో అని టెన్షన్‌తో చూస్తున్నారు మిత్రులిద్దరూ. వన్..టూ..త్రీ.. అంటూ కాలు ఓసారి, చెయ్యి ఓసారి తిప్పుతూ మ్యూజిక్‌ని అనుసరిస్తూ ఏరోబిక్ ఎక్సర్‌సైజులు చేస్తోంది. భూమి బద్దలయ్యే శబ్దం రిథమిక్‌గా వినిపించడంతో తాళం ప్రకారం అదిరిపడుతున్నారు అందరూ. ఇంతలో లోపల నుంచి ధన్‌మని శబ్దం వినిపించింది.

"అంకుల్...నేను ఆడుకొంటూ ఉంటే నా చెయ్యి తగిలి ఈ అద్దం పడిపోయింది" అస్సలు బెదరకుండా చెప్పాడు సుందరరావు కొడుకు.

"ఒరేయ్! కుర్రకుంక, ఎంత పనిచేశావ్‌రా.. తెల్లారి లేస్తే, ఆ అద్దంలో నా మొహం చూసుకోందే నేను ఏ పని మొదలెట్టను. బంగారం లాంటి అద్దం పగలగొట్టావ్ కదరా..వెధవా!" గట్టిగా అనాలనుకున్నాడు శంకరం, కానీ ప్రమోషన్ గుర్తొచ్చి, అన్నీ మనసులోనే అనుకొని, ఏడుపు మొహంతో నవ్వుతూ 'పర్వాలేదని' బదులిచ్చాడు.

"అప్పుడే మా వాళ్లు అల్లరి మొదలెట్టేసారా? ఎక్కడికైనా వస్తే చాలు, ఎంత అల్లరి చేస్తారో" అన్నాడు సుందరరావు మొక్కుబడిగా.

"పోన్లెండి సార్. పిల్లలు కాకపోతే పెద్దవాళ్లు చేస్తారా అల్లరి" సుందరరావు అన్న మాటకి ఏదో సర్ది చెప్పేలోపు వీపు మీద 'ఛల్' మని దెబ్బ తగిలింది ప్రకాష్‌కి. "అబ్బా" అని వెనక్కి తిరిగి చూసేసరికి అటకమీద కనిపించారు ఇద్దరు సిసింద్రీలూ. వాళ్లు అటక మీద సామాన్లు చిందరవందర చేయడమే కాక, ఖాళీ పౌడర్ డబ్బాని గురి చూసి ప్రకాష్‌కి తగిలేలా కొట్టారు.

"ఒరేయ్...దిగండ్రా.. అటకెక్కి ఏం చేస్తున్నారు?" పిల్లలని కిందకి దింపే ప్రయత్నం చేశాడు సుందరరావు బావగారు. ఇంతలో కాలి కింద భూమి కదిలినట్టు గమనించి హాల్లోకొచ్చి చూసేసరికి, బాస్ కూతురు ఎక్సర్‌సైజులు రెట్టించి చేస్తోంది. టీవీ చూస్తూనే మంచినీళ్లు కావాలని సైగ చేసింది. 'ఇస్తానండి' అని లోపలకి వెళ్లి సర్రున జారిపడ్డాడు శంకరం. ఇలా జారడానికి కారణం వెదికితే, ఒక చిచ్చరపిడుగు టూత్‌పేస్ట్ పట్టుకొని గది మొదలు నించి చివరి వరకు గీత గీసినట్టు పిండేస్తున్నాడు.

"అక్కడ ఏం చేస్తున్నావ్‌రా" మందలించింది సుపుత్రుడిని సుందరరావు చెల్లెలు.

"ఏం లేదు మమ్మీ.. టూత్‌పేస్ట్ ట్యూబ్‌ని పిండితే ఎంత వరకు వస్తుందా అని చూస్తున్నాను" చెప్పాడు పిల్లాడు చేస్తున్న పని ఆపకుండా.

"ఏవండీ...చూడండీ వీడి తెలివితేటలు, వీడి ఊహాశక్తి చూస్తుంటే మీకేమనిపిస్తోంది?" చంటాడి మాతృమూర్తికి సందేహాలు మొదలయ్యాయి.

'నాకైతే రెండు తన్నాలనిపిస్తోంది' మనసులోనే అనుకొని తెచ్చి పెట్టుకున్న నవ్వుని ఆపకుండా ప్రదర్శిస్తున్నాడు శంకరం.

* * *

"అంకుల్ ఆకలేస్తోంది. త్వరగా అన్నం పెట్టు" ఇంట్లో అమ్మని అడిగినట్టు నేల మీద దొర్లుతూ అడిగాడు సుందరరావు చిన్నకొడుకు. చంటాడి ఆకలి కేకతో దెబ్బకి అందరూ భోజనానికి ఉపక్రమించారు.

"సార్.. మీకిష్టమని వంకాయ కూర చేశాం సార్. మొహమాట పడకుండా తినండి" అన్నారు ఇద్దరూ జంటకవుల్లా. వంకాయకి ప్రమోషన్‌కి లింక్ ఉందని ఆలోచిస్తూ.

"ఇది వంకాయా? టెంకాయ్ అనుకున్నా..హి..హి.." జోకేసి నవ్వుతూ అంది సుందరరావు కూతురు.

'ఆపునీ బోడి జోకు' అని మనసులో అనుకొని, పైకి మాత్రం నోరంతా సాగదీసి ఆ నవ్వుకి బదులిచ్చారు స్నేహితులిద్దరూ ఒకరిని ఒకరు చూసుకుంటూ.

"మేడమ్.. మీరు ఈ సొరకాయ పులుసు ఇంకాస్త వేసుకోండి"

"బాబూ... ఈ పులుసు ఎలా చేశారో కాస్త చెప్తారా?" అడిగింది సుందరరావు భార్య.

"ఎందుకే నీకు బాగా నచ్చిందా?" అడిగాడు సుందరరావు ముద్ద మింగుతూ.

"మీ మీద కోపం వచ్చినప్పుడు ఈ పులుసు చేసి పెడదామని"

ఆ మాట విని సుందరరావు మొహం అదోలా అయిపోయింది. కానీ స్నేహితులిద్దరూ అన్నీ మర్చిపోయి ప్రమోషన్ ఒక్కటే లక్ష్యం అనుకొని, వాళ్లు వద్దంటున్నా మారు వడ్డిస్తూ కాకా పట్టడంలో ఎవరి టేలంట్ వాళ్లు చూపిస్తున్నారు. అందరూ ముద్ద నోట్లో పెట్టుకొని గొంతులోంచి కడుపులోకి పోవడానికి మధ్య మధ్యలో నీళ్లు ఎక్కిస్తూ, భోజన కార్యక్రమం అయిందనిపించారు.




* * *

"ఇంక మేం వెళ్లొస్తాం" అందరూ ఒకేసారి లేచారు.

సుందరరావు కారుకి స్టార్టింగ్ ట్రబుల్ ఉండడంతో మిత్రులిద్దరూ తమ బలమంతా ఉపయోగించి కారుని తోశారు. కారు స్టార్ట్ అవ్వడం, కొసమెరుపుగా బాస్ పెద్ద కూతురు ఓ నవ్వు విసిరి ఇద్దరికి ఝలక్ ఇవ్వడం రెండూ ఒకేసారి జరిగిపోయాయి. ఇద్దరూ బెంబేలెత్తి ఒక్క దూకులో లోపలకి వచ్చేశారు.

* * *

"వాన కురిసి వెలిసినట్టుంది కదరా" అన్నాడు శంకరం రొప్పుతూ.

"నిజమేరా. వాళ్లు ఉన్నంతసేపు మన ఇల్లు కిష్కింద అనిపించింది"

"అవునూ.. మనం, రెండు స్టూళ్లు వేసుకుంటేగానీ ఆ ఎత్తు అటక ఎక్కలేం కదా. వేలెడంత లేరు ఆ చిచ్చరపిడుగులు ఎలా ఎక్కేరంటావ్?" సందేహం వెలిబుచ్చాడు శంకరం.

"అల్లరిపిల్లలు, ఎలా ఎక్కారోగానీ నా వీపు మాత్రం విమానం మోత మోగించారు" అన్నాడు ప్రకాష్ వీపు రుద్దుకుంటూ.

"అది సరే గానీ చాలా ఆకలిగా ఉంది. ముందు అన్నం వడ్డించు" నీరసంగా అడిగాడు శంకరం.

"ఇంకెక్కడన్నం ప్రమోషన్ కోసం బాస్‌కి వీర లెవెల్లో అన్నమంతా వడ్డించేశాం కదా.. గిన్నెలు ఖాళీ" అన్నాడు ప్రకాష్ ఆఖరిమాటని నొక్కి వక్కాణిస్తూ.

"సరే పద ఏదైనా హోటల్‌కి వెడదాం"

* * *

శంకరం ప్రకాష్‌లు, దగ్గర్లోని హోటల్ లోపలకి వెళ్లి అవాక్కయ్యారు. అక్కడ సుందరరావు, ఆయన పరివారం భోజనం చేస్తూ కనిపించారు. ఆ దృశ్యం చూసి గోడకి కొట్టిన బంతిలా బయటకి వచ్చేశారు. ఇంతలో భోజనాలు ముగించి బాస్ పరివారం బైటకి వస్తూండడంతో పక్కకు నక్కారు స్నేహితులిద్దరూ.

"ఇప్పుడు కడుపు చల్లగా ఉంది" అన్నాడు సుందరరావు కడుపు నిమురుకుంటూ.

"నిజమే. అయినా అదేం భోజనం.. తినలేక చచ్చాం. ఇప్పటికి మీ ఆఫీసులో ఐదుగురు మనల్ని భోజనానికి పిలిచారు. అందరూ ఇలాగేనా చేశారు. ఆఖరికి మీ ప్యూనే నయం. నాకు జరీ అంచు చీర కూడా పెట్టాడు" అని ఇంటికి పిలిచి కాకా పట్టిన వాళ్ల లిస్ట్ చెప్పుకుపోతోంది బాసామణి. ఇదంతా వింటున్న ప్రకాష్‌కీ శంకరానికీ మతి పోయింది. తామే బాస్‌ని ముందు పిలిచి కాకా పట్టామన్నారు. కానీ తమకన్నా ముందు చాలా మంది కాకారాయుళ్లు ఉన్నారని తెలిసి బుర్ర తిరిగిపోయింది స్నేహితులిద్దరికీ.